# 28. బోడి హక్కులు

"పౌరహక్కులు" అంటే ఏంటి నాన్నా ?" అనడిగేడు మా రాస్కెల్ ఓ ఉదయాన్న నా చేతిలోని పేపరు చూస్తూ!

ఆరోజు ఆదివారం గనుక ఓపిగ్గా మావాడికి రాజకీయ చైతన్యం నూరిపోయాలని నిశ్చయించుకున్నాను. దానికి తోడు పెట్టెనిండా సిగరెట్లున్నాయి! లోపల్నుంచి వండుతున్న కూరతాలూకు ఘుమఘుమలు ఉత్సాహాన్ని పెంచాయి.

ఆ మధ్య మావాడి పుట్టిన్రోజుపండగ జరిపిన్నాట్నుంచీ నా ఎన్‌జీవో మిత్రులు జోకు చేస్తున్నారు. "మీ వాడిపేరు ఎంప్లాయిమెంటు ఎక్ఛేంజీలో నమోదు చేయించారా? ఎందుకేనా మంచిది! ఇప్పుడే చేయించండీ!" అని.

"ఎబ్బె! మావాడిది మహారాజ యోగం! వాడు ఎన్‌జీవో అవడు! వాళ్ళ లీడరయి, సమ్మెలూ గట్రా చేయించి నేను రిటైరయ్యేలోగా రెండు మేడలన్నా కడతాడు! చూస్తూండండి!" అని దబాయించేవాడిని.

అందుకని వాడి కిప్పట్నుంచీ రాజకీయాలు నూరిపోయటం నా డ్యూటీ గదా! "ఏమిట్రా అంటున్నావ్! నీకీ హక్కుల సంగతెవరు చెప్పర్రా?" అని ఆరా అడిగేను.

వాడు ముద్దు ముద్దుగా నవ్వేడు! నేను చదువుతూన్న పేపరు రెండో వేపు చూపించేడు " ఈమాత్రం తెలీదా ?" అన్నట్లు! అందులో ఓ పౌరహక్కులసభ తాలూకు న్యూసుంది. సభ బ్రహ్మాండంగా జరిగిందట హక్కుల్ని గురించి చాలా మంది గర్జించేరుట. బల్లలువిరిగేలా గుద్ది మరీ వాదించేరుట. ఆఖర్న ఎలక్షన్ల దగ్గరికి వచ్చేసరికి సెక్రటరీ పీట నా హక్కు అంటే, ప్రెసిడెంటు పీట నాహక్కు అంటూ బుర్రలు పగలేసుకునే దాకా వచ్చేరుట. అందుమీదట అసలు హక్కులు సంగతి వదిలేసి ఈ హక్కుల్ని గురించి విచారించి తేల్చేందుకు ఓ కమిటీని వేసేరుట.

"అసలు పౌరహక్కులు అంటే ఏంటి నానా?" మా వాడు మొదటి ప్రశ్నే మళ్ళీ అడిగేడు.

"పౌరులకు గల హక్కులు" అని వివరించేను. కానీ నా సమాధానం మరీ పిలక శాస్త్రుర్ల స్టైపుగా ఉందని నాకే అనిపించింది.

"పౌరులు అంటే ఎవరూ?"

"ఇంకెవర్రా? నువ్వూ, నేనూ, అమ్మా మనందరం పౌరులమే."

"మరి మన వంటలింగడు పౌరుడు కాడా?"

"ఎందుకు కాడూ! వాడూ పౌరుడే" నా ఉదారతకు నన్నే అభినందించుకున్నాను.

"మీ రిద్దరూ ఒక్కటెలా అవుతారు నాన్నా। నానమ్మ నిన్నెప్పుడూ తిట్టదు. లింగణ్ణెపుడూ అది సరిగా చెయ్యలేదు ఇది సరిగావండలేదని తిడుతుంటుంది. వాడెపుడూ వంటగదిలో అన్నం వండుతూనో, బాత్రూంలో బట్టలుతుకుతూనో, దొడ్లో అంట్లు తోముతూనో ఉంటాడు నువ్వేమో కాఫీ మీద కాఫీ తాగుతూ ఇక్కడ కుర్చీలో కూచుని పేపర్లు, పుస్తకాలు చదివేస్తుంటావు. నీకు వంటకూడా రాదటగా। మీరిద్దరూ ఒక్కటెలా అవుతారూ?"

మావాడు తప్పకుండా లీడరవుతాడని నాకు నమ్మకం కలిగింది. అయితే కాస్త కంట్రోల్లో ఉంచాలి. వంటవాళ్ళ సంఘాలు పెడితే మేడలుకట్టటంకష్టం. అందుకని "అవునురా। వంటచేయటం వాడి హక్కు" అని డబాయించేను.

"అవును తినటం, ఉపన్యాసాలివ్వటం మనహక్కు!" అంది అప్పుడే అటొచ్చిన మా ఆవిడ.

గేటుదగ్గిర ముష్టివాడెవడో పాటలు మొదలెట్టేడు. "మరి వాడుకూడా పౌరుడేనా నానా?" అనడిగేడు మావాడు కిటికీలోంచి చూస్తూ.

నేను కొంచెం తటతటాయించేను. వాడికి ఓటు ఉందా? ఓటుండాలంటే కనీసం వాడో పాకలోనన్నా ఉండాలి గదా! వేలిముద్రగాళ్ళకూ్కడా ఓట్లున్నాయనుకోండి. కానీ, వీడి కసలు వేళ్ళున్నాయా?

"పోనీ! హక్కులంటేమిటో చెప్పునాన్నా!" అన్నాడు మావాడు నామీద దయదల్చిన వాడిలా!

"అందరికీ తిండితినే హక్కు అన్నింట్లోకీ ముఖ్యమైందిరా!" అంది మా ఆవిడ.

మావాడికి ఉపన్యాసం ఇచ్చే నా హక్కుకు అడ్డం వచ్చినందుకు నాకు మండుకొచ్చింది.

"మరి నాకు మిఠాయి తినే హక్కు లేదా! అడిగితే పిర్ర పగలేస్తారేం?" మావాడు క్రాస్ ఎగ్జామినేషన్ మొదలెట్టాడు.

"నీపిర్ర పగలేస్తే నువ్వుఏడుస్తావు ఏడిస్తే ముద్దొస్తావు. అందుకని పిర్ర పగలేస్తుంటాం!" అనాన్నేను.

మా ఆవిడ చురచురా చూసింది. "కాదురా బాబూ! నీకు రోజూ మిఠాయి పెడితే మీ నాన్నారి జీతం పదిహేను రోజులకూడా చాలదు. మిగతా పదిహేను రోజులూ ఇందాక వచ్చిన ముష్టివాడిలా అప్పులు అడుక్కుంటూ కాలక్షేపం చేయాలి!" అందావిడ!

ముష్టివాడితో పోలిక తెచ్చినందుకు నాకాస్తకోపం వచ్చినమాట నిజం. కానీ మింగేసేను.

"ఎందుకు ముష్టెత్తాలి?" మావాడు ఎదురు ప్రశ్న వేశాడు.

"మీ నాన్నారికొచ్చే జీతం చాలదురా."

"చాలకపోతే చాలినంత ఎందుకు తెచ్చుకోరాదూ?"

''ఆఫీసులో అడిగినంత ఇవ్వరురా."

"ఇమ్మనే హక్కు నాన్నకు లేదా?"

నేను జోక్యం చేసుకున్నాను. "ఉందిలేరా. కానీ, లేదు పొమ్మనే హక్కు వాళ్ళకూ్కడా ఉంది."

"ఎందుకు లేదంటారు?"

"మాఆఫీసువాళ్ళదగ్గిర డబ్బులేదు. వాళ్ళకు అమెరికా వాడు అప్పివ్వలేదు. రష్యావాడు బియ్యం పంపలేదు."

''అయితే మీ ఆఫీసువాళ్ళు కూడా ఇందాక వచ్చిన ముష్టోడి బాపతేనన్న మాట. నువ్వు ఆ ముష్టోళ్ళ నౌకరువా. ఛీ. నాన్నా. ఆ ముష్టాఫీసులో నౌకరీ మానేయరాదూ."

''అన్ని ఆఫీసులూ అంతేలేరా!'' అని సర్దబోయింది మా ఆవిడ.

నేను గతుక్కుమన్నాను. మావాడు దారి తప్పుతున్నాడు. ఇలాగయితే మేడలుకట్టడం కష్టం. జైలుకెళ్ళటం సులభం.

మా ఆవిడ నా అవస్థకు గాబోల్ను ముసిముసిగా నవ్వుకుంటోంది.

"మీరు తెచ్చే పత్రికల, పుస్తకాల ప్రభావం బాగానే ఉన్నట్లుందండీ."

"ఈ రాస్కెల్ చదివేస్తున్నాడా?"

"అవునుగానీ, తెలీకడుగుతాను! వీళ్ళంతా కాల్చేస్తాం, కూల్చేస్తాం, అది మా జన్మహక్కు అన్నట్లుగా రాస్తుంటారు గదా. మరి ఈమీటింగు లేంటండీ. మమ్మల్ని కాల్చేయకండి, కూల్చేయకండి! మీకా హక్కు లేదు మహాప్రభో. అన్నట్లుగా ఈ సభలెందుకండీ." అంది మా ఆవిడ.

(ఫిబ్రవరి 1974)